క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

ఏలేశ్వరం: పెద్దనాపల్లిలో అక్రమ నిర్మాణాలు అరికట్టాలని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తహసీల్దార్ చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపై హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వగా ధిక్కరించి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు సభ్యులు సుంకర సత్తిబాబు, రాపేటి రాజబాబు, కర్రిచంద్రరావు, శెట్టి సూరిబాబు, అప్పకొండ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు

ఏలేశ్వరం: విద్యార్థులకు బస్‌పాస్‌లు జారీ చేయనున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ జి.వి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా బస్‌పాస్‌లు ఇస్తామన్నారు. వీరు పూర్తి చేసిన దరఖాస్తు, పాఠశాల స్టడీసర్టిఫికెట్, పాస్‌పోర్ట్‌సైజు ఫొటో తీసుకువచ్చి పాస్ పొందాలన్నారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, మెడికల్, ఇంజినీరింగ్, ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు రాయితీతో పాస్ ఇస్తామన్నారు. దివ్యాంగులకు 50 శాతం రాయితీతో పాస్ జారీ చేస్తామన్నారు. సదరన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు, పాస్‌పోర్టుసైజు ఫొటో, నిర్ణీత రుసుం చెల్లించి పాస్ తీసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

తుని కాంప్లెక్స్‌లో..

తుని: విద్యార్థులకు బస్‌పాస్‌లు సోమవారం నుంచి జారీ చేయనున్నట్టు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కాంప్లెక్స్‌లో బస్‌పాస్ కౌంటర్ వద్ద రోజంతా పాస్‌లు ఇస్తామన్నారు. తుని డిపో పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన వేసవి శిబిరం

కిర్లంపూడి: మండలంలో గత నెల 8వ తేదీ నుంచి గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఘనంగా ముగిసింది. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ దంతా మరిడిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకుపలువురు ఉపాధ్యాయులు, సీనియర్ పాఠకులు కథలు, కథనాలు, సాంస్కృతికి కార్యక్రమాలు, చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. సోమవారం ముగింపు వేడుకల్లో భాగంగా శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కేశాప్రగఢ సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కురుమళ్ళ విష్ణు, తూము కల్యాణ్, మణి కంఠ, బాదంపూడి చిన్నసూర్యం ఆధ్వర్యంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్



తిరుమలాయపాలెంలో పోలీసు పికెట్

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలో అనుమతులు లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం, తద్వారా పోలీసులు ఆ విగ్రహాన్ని తొలగించడంతో ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో గ్రామంలో 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు గ్రామంలోకి వచ్చే వాహనాలు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈనెల 14 వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.

రైల్వేగేటుకు మరమ్మతులు

తొండంగి: గోపాలపట్నం రైల్వేగేటును సోమవారం మధ్యాహ్నం మినీ వ్యాన్ ఢీకొట్టడంతో మరమ్మతులకు గురైంది. దీంతో సుమారు రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. రైల్వే సిబ్బంది ఎలక్ట్రానిక్ గేటుకు మరమ్మతులు చేపట్టారు.

వారాహి యాత్రను విజయవంతం చేయాలి

ఏలేశ్వరం: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బుధవారం కత్తిపూడిలో నిర్వహించనున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల తమ్మయ్యబాబు అధ్యక్షతన స్థానిక ఎస్ కన్వన్షన్ హాలులో సోమవారం పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు పెంటకోట మోహన్, చిలకం మధుసూదన్‌రెడ్డి, అక్కల గాంధీ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఐదు లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎస్ఈబీ పరిధిలో సోమవారం నిర్వహించిన దాడుల్లో ఐదు లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఒమ్మంగి గ్రామంలో సారా తరలిస్తున్న అవిరపు సత్యనారాయణను అరెస్టు చేసి, అతని నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పెదశంకర్లపూడి గ్రామంలో వంద లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఆ బట్టీ యజమాని కోటా పెద్దరాజు పరారయ్యాడని చెప్పారు. పరారైన వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

తొలిరోజే విద్యార్థులకు జగనన్న కానుక

- సర్కారు బడుల్లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ
- పాఠశాలల్లో నెలకొన్న సందడి



వి.కొత్తూరులో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, మండల కన్వీనర్లు

ఏలేశ్వరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. దీంతో సందడి నెలకొంది. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేశారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దా సూర్యప్రకాశ్, ఉపసర్పంచ్ గొల్లపల్లి సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, కోరాడప్రసాద్ పాల్గొన్నారు. తూర్పులక్ష్మీపురంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సిరిపురం ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం జి.సుందరరావు ఆధ్వర్యంలో సర్పంచ్ నూకరాజు విద్యార్థులకు కిట్లు అందజేశారు.

గోకవరం మండలంలో...

గోకవరం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకోవడంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గోకవరంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, తోలేటి రాంప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. పీఎంసీ చైర్మన్ కణితి శ్రీనివాస్, హెచ్‌ఎం పి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఉప సర్పంచ్ డి.ధర్మరాజు, దంగేటి వెంకటరత్నం, పీఎంసీ చైర్మన్ గుప్తులు పాల్గొని కిట్లు అందజేశారు.



పెద్దనాపల్లిలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి మండలంలో..

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు సోమవారం పంపిణీ చేశారు. వీరవరంలో ఎంపీపీ తోట రవి, వేలంకలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దోమాల గంగాధర్, జగపతినగరంలో కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, పెంటకోట నాగబాబు, రాజుపాలెంలో గణేశుల లచ్చబాబు పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లు అందజేశారు.

ప్రత్తిపాడు మండలంలో...

ప్రత్తిపాడు: పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థి చేతికి జగనన్న విద్యా కానుక అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్‌తో కలిసి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, ఉప సర్పంచ్ మదినే నూకరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ మేడిబోయిన పెదకాపు, వైఎస్సార్ సీపీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, కట్టమూరి కొండబాబు, ధరణాలకోట తాతబ్బాయి, హెచ్‌ఎం రజనీ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి

తుని మండలంలో..

తుని రూరల్: ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు తెరుస్తూనే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. సోమవారం వి.కొత్తూరు, హంసవరం తదితర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, పాఠ్య పుస్తకాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. వి.కొత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాము, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. హంసవరంలో సర్పంచ్ రాయి మేరీఅవినాష్ విద్యార్థులకు కిట్లు అందజేశారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంఈఓ పరవాడ గీతాదేవి, సర్పంచ్‌లు దుంగల గణపతి రోజారాణి, బుద్దాల సత్తిబాబు, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ, నాయకులు పాల్గొన్నారు.

కోటనందూరు మండలంలో..

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎంపీపీ లగుడు శ్రీనివాసు విద్యార్థులకు కిట్లు అందజేశారు. అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేకాధికారి రాజేశ్వరితో కలిసి కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ సుర్ల రాంబాబు, ఉపసర్పంచ్ దార్ల సూర్యచంద్ర, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి కనకదుర్గశ్రీను, హెచ్‌ఎం ఎన్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంఖవరం మండలంలో..

శంఖవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. జి.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సర్పంచ్ ఈగల విజయదుర్గ, మండల వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వై.సూర్యనారాయణ, వైస్ సర్పంచ్ కుమార్ పాల్గొనారు.

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీలో వైఎస్సార్ సీపీ మండల జేఈసీ నేత రామిశెట్టి విద్యార్థులకు కిట్లు అందజేశారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఉత్తరకంచి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, పోతులూరు, వాకపల్లి తదితర గ్రామాల్లో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, మామిడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి మండలంలో..

గండేపల్లి: మురారి హైస్కూల్ విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు (పద్మనాభుడు)ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కల ఆనందబాబు, ఉపసర్పంచ్ జాస్తి వసంత్, ధన, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు

తుని: విద్యార్థుల భవిష్యత్‌కు సీఎం జగన్ బంగారు బాటలు వేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, మున్సిపల్ కమీషనర్ ప్రసాదరాజు, ఎంఈఓ పరవాడ గీతాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తునిలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ

తుని రూరల్: ఎస్.అన్నవరం జగనన్న కాలనీలో రూ.మూడు కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ నిర్వహించారు. సోమవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, ట్రాన్స్‌కో అధికారులు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. ఈ కాలనీలో 1100 ఇళ్ల నిర్మిస్తుండడంతో ఇళ్ల లబ్ధిదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీపీ రాము పేర్కొన్నారు. రూ.మూడు కోట్లు, సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకి లబ్ధిదారుల తరపున ఎంపీపీ, వైస్ ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌స్టేషన్ పనులు ఈ ఏడాది ఆఖరికి పూర్తి చేస్తామని ట్రాన్స్‌కో ఏడీఈ రత్నాలరావు చెప్పారు. లోఓల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వరహాలబాబు, చక్రరావు, కార్యదర్శి మధుశేఖర్, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేస్తున్న నాయకులు

అనుభవ హక్కు పత్రాలు ఇవ్వాలని ధర్నా

ప్రత్తిపాడు: తాము నివశిస్తున్న ఇళ్లకు అనుభవ హక్కుపత్రాలు ఇవ్వాలంటూ పెద్దిపాలెం శివారు కిత్తమూరిపేట గిరిజనులు సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు నాయకత్వం వహించిన ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ కిత్తమూరిపేటలో వలస భూస్వాములకు, గిరిజనులకు మధ్య జరిగిన ఒప్పందం మేరకు కొంతభూమిని గ్రామానికి కేటాయిస్తూ పెద్దాపురం ఆర్డీఓ, తహసీల్దార్ సమక్షంలో అప్పగించామన్నారు. సర్వే నంబరు 200లోని ఈభూమిలో గిరిజనులు ఇళ్ల నిర్మాణం చేపట్టి, నివశిస్తున్నారన్నారు. అయితే ఈ భూమిన సబ్ డివిజన్ చేసి, తిరిగి భూస్వాముల పరం చేసేందుకు ప్రయత్నించడం అన్యాయమని అన్నారు. తక్షణం అధికారుల సమక్షంలో జరిగిన ఒప్పందం మేరకు గిరిజనుల భూములకు అనుభవ హక్కుపత్రాలు మంజూరు చేయాలని రేచుకట్ల సింహాచలం డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తమ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు అందజేశారు.

మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ధర్మవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: మాయ మాటలతో ప్రలోభాలు పెట్టే టీడీపీ, జనసేన వంటి పార్టీలను త్వరలోనే ప్రజల ముందుకు వస్తున్నాయని వారిని నమ్మొద్దని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ధర్మవరం సచివాలయం-3 సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సొసైటీ చైర్మన్ చక్కపల్లి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల బాబులు, నానిపల్లి చంటి తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల శేఖర్‌బాబు, పార్టీ నాయకులు బొల్లు తాతాజీ, కుప్పిన శ్రీను, కృపావరం, రాపా గుర్రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

రోడ్డు ప్రమాదంలో సచివాలయ సెక్రటరీ మృతి

గండేపల్లి: గ్రామ శివారు సోమా కంపెనీ ఎదురుగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయ సెక్రటరీ కె.రమణమూర్తి (45) మృతి చెందాడు. ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామంలో సెక్రటరీగా పని చేస్తున్న రమణమూర్తి మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళుతుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వం హాస్పటల్‌కి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసస్తున్నట్టు తెలిపారు.

మరో 61 మంది ఉపాధ్యాయుల బదిలీ

ప్రత్తిపాడు : మండలంలో పని చేస్తున్న 61 మంది ఉపాధ్యాయులు (ఎస్‌జీటీ) సోమవారం ఇతర మండలాలకు బదిలీ అయ్యారని మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. వీరి స్థానంలో ఇతర మండలాల నుంచి 51 మంది ఎస్‌జీటీలు బదిలీపై వచ్చినట్టు ఆయన తెలిపారు. తొలిరోజు 210 మంది ఉపాధ్యాయులకు గానూ 82 మంది బదిలీ కాగా 79 మంది మండలానికి బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే.

ఎన్‌పీఎల్-8 క్రికెట్ టోర్నీ విజేత రాజేష్ వారియర్స్



రాజేష్ వారియర్స్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సర్పంచ్

గండేపల్లి: నీలాద్రిరావుపేట గ్రామ యువకులు, సీనియర్, జూనియర్ క్రికెటర్ల సహాయంతో గత కొన్ని రోజులుగా నిర్వహించిన ఎన్‌పీఎల్-8 క్రికెట్ పోటీల్లో విన్నర్స్ రాజేష్ వారియర్స్, కిషోర్ జట్టు ఫైనల్‌గా నిలిచి తలపడగా రాజేష్ వారియర్స్ విజయం సాధించింది. వీరికి గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్ తదితరుల చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. అడపా రవికుమార్, బర్ల కిషోర్, కర్రా చిన్న, పుర్రె స్వామి, నేదూరి ప్రసాద్, వీవీఎస్ కుమార్ తదితరులు ఆర్గనైజేషర్స్‌గా వ్యవహరించినట్టు నిర్వాహకులు తెలిపారు. బెస్ట్ బ్యాట్‌మెంటన్ పుర్రె స్వామి, బెస్ట్ బౌలర్‌గా కోమలి చందు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా బిక్కిన ప్రసాద్ ఎంపికైనట్టు తెలియజేశారు.

రీ సర్వేతో భూములకు పూర్తి రక్షణ

కోటనందూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంతో భూములకు పూర్తి రక్షణ ఏర్పడుతుందని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎల్లీపేటలో భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే అనంతరం మనకున్న కచ్చితమైన భూమి ఎంతనేది తెలుస్తుందన్నారు. మన భూమిని మన అనుమతి లేకుండా మరొకరు ఎటువంటి మార్పు చేయడానికి వీలుండదన్నారు. డ్రోన్ సర్వే అనంతరం ఉన్నతాధికారుల నుంచి వచ్చిన(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)మ్యాప్ల ఆధారంగా సర్వే కొనసాగుతుందన్నారు. సర్వే చేయించుకునే రైతులు పొలం డాక్యుమెంట్లు, పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. సర్పంచ్ తుమ్మల రాణి, డీటీ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి భ్రమరాంబ, వీఆర్వో సుభద్రాదేవి, రైతులు పాల్గొన్నారు.

మూగజీవాలకు ఎండ దెబ్బ

- రైతులు నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సలహా



వేసవి తీవ్రతకు చెట్ల కింద సేదతీరుతున్న పశువులు

ప్రత్తిపాడు: ఎండలు మండిపోతున్నాయి. రోహిణీ కార్తె పోయి మృగశిర వచ్చినా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ఇంకా పెరుగుతున్నాయి. ఎండలకు మనుషులే తట్టుకోలేకపోతున్నారు. మూగజీవాల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. నోరులేని పశువులు అనారోగ్యానికి గురైతే పశు పోషకులు తీవ్రంగా నష్టపోయే అవకాశముంది. పాడి రైతులు పశుపోషణ పరంగా నిర్లక్ష్యం వహిస్తే పశువులు వడదెబ్బకు గురవుతాయి. దీనిని గుర్తించి గుర్తించి, కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ నుంచి పశువులను కాపాడుకోవచ్చని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. వడదెబ్బ నివారణ గురించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇంకో 15 రోజుల వరకూ పశువులను పసిపాపలా చూసుకోవాలని, మేలైన యాజమాన్య పద్ధతులు, పోషణ విషయంలో శ్రద్ధ వహిస్తే వడదెబ్బ నుంచి పశువులను రక్షించుకోవచ్చని మండల పశువైద్యాధికారి ఎస్.వరలక్ష్మి చెబుతున్నారు.

నల్లజాతి పశువులకు ఎక్కువ ప్రమాదం

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో ఆవులు 2,935, గేదెలు 11,372, ఏలేశ్వరం మండలంలో ఆవులు 2,440, గేదెలు 9,302, రౌతులపూడి మండలంలో ఆవులు 2,790, గేదెలు 11,688, శంఖవరం మండలంలో ఆవులు 3,278, గేదెలు 8,130 వెరసి 11,443 ఆవులు, 40,492 గేదెలు ఉన్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. వీటిలో నల్లజాతి పశువులకు ఎక్కువ ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంటుంది. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాలు, ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసినప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు, అధిక శ్రమకు గురై వేడి గాలుల తాకిడి వల్ల పశువులు వడదెబ్బకు గురవతాయి. తెల్లజాతి పశువుల కంటే నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు లోనవుతాయి. ఒక్కసారి వడదెబ్బ తగిలిన పశువుకు గతంలో మాదిరిగా పాల దిగుబడి ఉండే అవకాశం ఉండదు. పశుపోషణలో ఉపాధి పొందుతున్న రైతులు వాటిని ఎండల బారి నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది. తద్వారా చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రొలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత పెరగడంతో పాటు శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతాయి. మూత్ర విసర్జన కూడా కుంటుపడుతుంది. పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.

చల్లని ప్రదేశంలో ఉంచాలి



పశువులు వడదెబ్బకు గురైనట్టు గుర్తించిన వెంటనే రైతులు వాటిని నీటితో కడిగి, చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరే వరకూ పలుమార్లు నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్య సిబ్బందిని సంప్రదించి, తగిన చికిత్స చేయించాలి. సరైన జాగ్రత్తలతో ప్రయోజనం చేకూరుతుంది.

– ఎస్.వరలక్ష్మి, పశువైద్యాధికారి, ప్రభుత్వ పశువైద్యశాల, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

వడదెబ్బ లక్షణాలు

- పశువుల శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకూ పెరుగుతుంది.
- పశువులు నడిచేటప్పుడు తూలతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది.
- పశువులు చాలా నీరసంగా ఉంటాయి. ఒక్కోసారి కిందపడి కొట్టుకుని, స్పృహ కోల్పోతాయి.
- వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. అతిసారా వ్యాధి సోకుతుంది.
- నీడకోసం చెట్టు కింద చేరి కూలబడుతాయి. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి, ఒక్కొసారి మరణిస్తాయి.
- పశు చర్మం సున్నితత్వం కనిపిస్తూ గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది.

నివారణా చర్యలు

- వేసవిలో పగటివేళ పశువులను మేత కోసం బయటకు వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉండే సమయాల్లో మాత్రమే బయట తిరగనివ్వాలి.
- శుభ్రమైన తాగునీటిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి. కలుషితమైన నీటిని తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి ప్రవేశించి, పారుదు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది.
- పశువులను రోజుకు మూడు లేదా నాలుగు సార్లు చల్లని నీటితో కడగాలి.
- ఎక్కువ శాతం పచ్చిమేతను పెట్టాలి. ఎండు మేత లేదా దాణాను నీటిలో తడిపి పెట్టాలి.
- గేదెలకు 60-70 లీటర్లు, ఎద్దులకు 90-100 లీటర్ల వరకూ మంచినీటిని అందించాలి.
- సూడి పశువులకు చివరి త్రైమాసికంలో మేత బయట కాకుండా ఇంటివద్దే ఏర్పాటు చేయాలి.
- సేద్యపు ఎద్దులచేత వీలైనంత తక్కువ పని చేయించుకోవాలి.

అమిత్‌షా ఆరోపణలకు సమాధానం చెప్పాలి

అన్నవరం: కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై చేసిన విమర్శలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక వన్ రిసార్ట్స్‌లో జరిగిన టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ కుమార్, మెట్ల రమణబాబు, సరిపిల్లి రాజేష్ పాల్గొన్నారు.